## క్లుప్తంగా

### బైకులు ఢీ.. వృద్ధుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన ఏడుకొండలు

మద్దిపాడు: ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మద్దిపాడు మండలంలోని వెంకటకృష్ణాపురం బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ధర్మవరం గ్రామానికి చెందిన బారెడ్డి ఏడుకొండలు(60) కొండపిలో నివాసం ఉంటున్నారు. రోజులాగే పాలు పట్టేందుకు తన బైక్‌పై కొండపి నుంచి ధర్మవరం వెళ్తున్నారు. అదే సమయంలో గుండ్లసముద్రం గ్రామానికి చెందిన వీరమోసు వెంకటేశ్వర్లు పొగాకు రెలిపేందుకు పచ్చవ గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. సరిగ్గా వెంకటకృష్ణాపురం బస్టాండ్ సెంటర్ వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయారు. బారెడ్డి ఏడుకొండలు తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వీరమోసు వెంకటేశ్వర్లుకు ఎడమ కాలు విరిగింది. క్షతగాత్రుడిని 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు, ఏడుకొండలు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. మృతుడి కుమారుడు రాఘవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివబసవరాజు తెలిపారు.

### ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముసలయ్య

గుడ్లూరు: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గుడ్లూరు–తెట్టు ప్రధాన రహదారిలో రాళ్లవాగు వద్ద మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. పోట్లూరు గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన పోట్లూరు ముసలయ్య, చలంచర్ల రమణయ్యలు మోటార్ సైకిల్‌పై గుడ్లూరుకు వచ్చి తిరిగి పోట్లూరుకు వెళ్తుండగా చెమిడిదిపాడు దాటి రాళ్లవాగు వద్దకు వచ్చేసరికి రోడ్డు పక్క నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను అదుపుతప్పి వేగంగా ఢీకొట్టారు. దీంతో ఇద్దరు యువకులు రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలయ్యారు. ఇద్దరిని 108లో వాహనంలో కావలి తరలిస్తుంగా ముసలయ్య (40) మార్గమధ్యంలో మృతి చెందాడు. రమణయ్యకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో కావలికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి

- జిల్లాలో 18 చెక్‌పోస్టుల ద్వారా నిరంతరం వాహన తనిఖీలు
- ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి
- పోలీస్ నోడల్ అధికారులతో ఎస్పీ పరమేశ్వరరెడ్డి సమీక్ష



ఎస్పీ పరమేశ్వర రెడ్డి



సమీక్షకు హాజరైన పోలీస్ నోడల్ అధికారులు

ఒంగోలు సబర్బన్: ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా విధులు నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలోని ఛాంబర్‌లో మంగళవారం జిల్లా పోలీస్ అధికారులు, పోలీస్ నియోజకవర్గాల నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలు, పాటించాల్సిన నియమాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొని పాటించాలన్నారు. ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై నియోజకవర్గాల పోలీస్ నోడల్ అధికారులతో సమీక్షించారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేలా ప్రణాళికాబద్ధమైన ముందస్తు చర్యల గురించి వివరించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే ట్రబుల్ షూటర్స్‌ను గుర్తించాలని, నేర చరిత్ర కలిగిన వారిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలతో మమేకమై ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం, ఇతర వస్తువులు అక్రమ రవాణాకు కళ్లెం వేసేలా చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ ముమ్మరం చేయాలని సూచించారు. ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఒకపక్క శాంతి భద్రతలను పర్యవేక్షిస్తూనే ఎన్నికల ప్రక్రియలో నియమ నిబంధనలను కూడా పాటించాలన్నారు. ఇప్పటికే షెడ్యూల్ విడుదలైనందున తరువాత నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి నామినేషన్ దాఖలు దశ నుంచి ఎన్నికల ఫలితాలు ప్రకటన వరకు పోలీసులు అందరూ ఎన్నికల సంఘం నియంత్రణ, పర్యవేక్షణలోనూ, క్రమశిక్షణకు లోబడి పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ స్వేచ్ఛాయుత, పారదర్శక, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. డీఎస్పీ, సీఐ, ఎస్సైలు సిబ్బందితో కలిసి గ్రామ సందర్శన చేపట్టాలని సూచించారు. గ్రామస్తులతో మమేకమై ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించినప్పుడు ప్రశాంతంగా ఎన్నికలు నిర్వర్తించగలమన్నారు. గ్రామాల్లో అశాంతి, ఎలాంటి అల్లర్లు, గొడవలు ఉత్పన్నం కాకుండా ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సెక్టార్ పోలీస్ ఆఫీసర్ వారి పరిధిలోని గ్రామాలు, పోలింగ్ స్టేషన్లను సందర్శించాలన్నారు. అక్కడ చేపట్టాల్సిన భద్రతా చర్యలు, గత ఎన్నికల్లో జరిగిన వర్గ విభేదాలు, రాజకీయ గొడవలు, ప్రస్తుత స్థితిగతులను సమీక్షించి ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. గత ఎన్నికల్లో బూత్ స్థాయిలో జరిగిన గొడవలు, అవకతవకలు, అక్రమాలు, నేర కార్యకలాపాల వంటి అనేక అంశాల ఆధారంగా రూపొందించిన నివేదిక ఆధారంగా ముందుకు సాగాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో జిల్లా ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ప్రకారం పటిష్ట బందోబస్తుతో పాటు కేంద్ర సాయుధ బలగాల మోహరింపుతో తగిన భద్రతాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత ఎన్నికలకు సంబంధించిన కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యూలను ప్రత్యేక టీంలతో త్వరితగతిన ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆయుధ లైసెన్స్‌లు కలిగిన వారి వద్ద ఉన్న మిగిలిన ఆయుధాలను డిపాజిట్ చేయించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తరుచూ వాహనాలను తనిఖీ చేసి అక్రమ నగదు, మద్యం, ఇతర వస్తువుల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 24 గంటల పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు క్షేత్రస్థాయిలో పటిష్టంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సీజ్ చేసిన నగదు, నగలు, వస్తువులు, మద్యం లాంటి వివరాలను ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఈఎస్ఎంఎస్)యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి నోడల్ ఆఫీసర్స్‌కు తెలియజేయాలన్నారు. సీ–విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణమే ప్రతిస్పందించాలన్నారు. సమీక్షలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైమ్స్)ఎస్‌వి.శ్రీధర్ రావు, ఏఆర్ ఏఎస్పీఅశోక్ బాబు, డీఎస్పీలు కిషోర్‌బాబు, రామరాజు, అశోక్‌వర్ధన్, సీహెచ్ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎలక్షన్ సెల్ సీఐ వి.సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## సజ్జలతో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ భేటీ



సజ్జలను సన్మానిస్తున్న షంషేర్ అలీబేగ్

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లిలోని కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అలీబేగ్ మాట్లాడుతూ.. సజ్జల రామకృష్ణారెడ్డి సూచన మేరకు పశ్చిమ ప్రకాశంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ మహమ్మద్ మసూద్ అలీబేగ్ ఉన్నారు.

## నమో.. నారసింహా..



పల్లకిపై ఊరేగుతున్న స్వామివారు

- అంకురార్పణతో పృథులగిరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మద్దిపూడి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మద్దిపూడి పరిధిలోని పృథులగిరి(పాదిలి కొండ)పై కొలువైన లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఫాల్గుణ శుద్ధ దశమి గడియల్లో అంకురార్పణతో ఘనంగా ప్రారంభమయ్యాయి. మద్దిపూడిలో విష్ణు దేవాలయంలోని ఉత్సవమూర్తులను అర్చకులు నారాయణం మారుతీచార్యులు, తిరుమలాచార్యులు పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని పల్లకిపై ఉంచి గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ వైభవంగా ఊరేగించారు. ఊరేగింపు సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవమూర్తులను బోయీల సాయంతో కొండపైకి తీసుకెళ్లారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. నేలబొట్ల లక్ష్మీనరసింహ శాస్త్రి కుమారులు కొట్రా లక్ష్మీసత్యన్నారాయణ ఉభయదాతగా వ్యవహరించారు. ఈఓ ఎం.శ్రీనివాసరావు, పాలక మండలి చైర్మన్ కుప్పం కొల్లారావు, సిబ్బంది కాటూరి ప్రసాద్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఒక హత్య.. వంద అబద్ధాలు





1. టీడీపీ నేత అశోక్‌రెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్న నిందితుడు అల్లూరయ్య, 2. అశోక్‌రెడ్డి పక్కనే ఉన్న హతుడు మునెయ్య (వృత్తంలో ఉన్న వ్యక్తులు)

- టీడీపీ నేతల గొడ్డలి దాడిలో అదే పార్టీ నాయకుడు మృతి
- గిద్దలూరు మండలం పరమేశ్వరనగర్‌లో సోమవారం రాత్రి ఘటన
- వ్యక్తిగత గొడవలు, పార్టీలో ఆధిపత్య పోరే ఘర్షణకు కారణం
- హత్యను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అంటగట్టేందుకు టీడీపీ నేతల పన్నాగం
- పాతకక్షల నేపథ్యంలో జరిగిన హత్యపై ఎల్లో మార్క్ ప్రచారం

గిద్దలూరు రూరల్: టీడీపీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు, వ్యక్తిగత విభేదాలు వెరసి ఓ వర్గానికి చెందిన నాయకుడి హత్యకు దారితీశాయి. సోమవారం రాత్రి గిద్దలూరు మండలం గడికోట పంచాయతీ పరిధిలోని పరమేశ్వరనగర్‌లో టీడీపీకి చెందిన నలుగురు వ్యక్తులు కలిసి అదే పార్టీకి చెందిన పాముల మునెయ్య(35) అనే వ్యక్తిపై గొడ్డలితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనతో వైఎస్సార్ సీపీ నాయకులకు ఎలాంటి సంబంధం లేకపోయినా టీడీపీ నేతలు హత్యా రాజకీయానికి తెరలేపారు. గిద్దలూరు టీడీపీ ఇన్‌చార్జి ఎం.అశోక్‌రెడ్డి హడావుడిగా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వైఎస్సార్ సీపీ నేతలపై విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియా వేదికగా విష ప్రచారానికి పూనుకున్నారు. హంతకులు, హతుడు ఇద్దరూ టీడీపీ నాయకులే అయినప్పటికీ వాస్తవాలను కప్పి పుచ్చి అబద్ధాలు ప్రచారం చేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

**ఇవిగో వాస్తవాలు..**

పరమేశ్వరనగర్‌కు చెందిన పాముల మునెయ్య(35)కు తన సమీప బంధువు అయిన గుండాల అల్లూరయ్యకు వ్యక్తిగత విభేదాలున్నాయి. పలు సందర్భాల్లో వారి మధ్య ఘర్షణ కూడా చోటుచేసుకుంది. ఈ క్రమంలో పాముల మునెయ్య స్నేహితుడైన ఓబులాపురం తండా నివాసి రామాంజనేయులు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో జామాయల్ కర్ర కొట్టుకొచ్చాడు.

దీనిపై ఈ నెల 14వ తేదీన అటవీశాఖ అధికారులకు సమాచారం అందడంతో జామాయిల్ తోటను పరిశీలించి నిందితుడైన రామాంజనేయులును అదుపులోకి తీసుకున్నారు. అతడికి జరిమానా కూడా విధించారు. అయితే, అల్లూరయ్య ఇచ్చిన సమాచారంతోనే రామాంజనేయులును అటవీశాఖ అధికారులు పట్టుకున్నారని ఆగ్రహించిన మునెయ్య దుర్భాషలాడాడు. అదీగాక గ్రామంలోని పలువురు మహిళలతో మునెయ్య అసభ్యకరంగా ప్రవర్తించేవాడని, ఆ విషయంలోను అల్లూరయ్యకు మునెయ్యకు మధ్య ఘర్షణ చోటుచేసుకుందని సమాచారం. దీనికి తోడు తెలుగుదేశం పార్టీలో మునెయ్యకే ప్రాధాన్యత ఇస్తుండటం వల్ల అల్లూరయ్య పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనకుండా అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నాడు. ఈ పరిణామాల నేపథ్యంలో అల్లూరయ్య తన మనుషులైన ఈశ్వర్, ప్రేమ్‌కుమార్, రంగయ్యతో కలిసి గొడ్డలితో మునెయ్యపై దాడికి పాల్పడ్డాడు. తలపై తీవ్ర గాయాలైన మునెయ్యను బంధువులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దాడి ఘటనతో ప్రమేయం ఉన్న నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వైవీ సోమయ్య తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని చెప్పారు.

## సువిధ పోర్టల్ వినియోగించుకోవాలి

- రాజకీయ పార్టీలకు సూచించిన కలెక్టర్ దినేష్‌కుమార్



రాజకీయ పార్టీలతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎన్నికల పోటీలో ఉండే అభ్యర్థుల నామినేషన్, ప్రచారానికి అనుమతి, అఫిడవిట్ సమర్పించేందుకు సువిధ పోర్టల్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. పోర్టల్‌పై అవగాహన కల్పించేందుకు మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రకాశంభవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి, బహిరంగ సభ నిర్వహణకు 48 గంటలు ముందుగా పోర్టల్ ద్వారా అనుమతి తీసుకోవాలన్నారు. అందుకోసం వినియోగించే ప్రచార సామగ్రి వివరాలు కూడా తెలియచేయాల్సి ఉంటుందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ పోలింగ్ కేంద్రాల వివరాలను కూడా తక్షణమే ఈ పోర్టల్ అప్‌లోడ్ చేయాలని ఆర్‌ఓను ఆదేశించారు. ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సంబంధిత పత్రాలను వ్యక్తిగతంగా తమకు అందచేయవచ్చని తెలిపారు. సువిధ యాప్‌ను వినియోగించుకోవడంపై త్వరలో వర్క్‌షాప్ నిర్వహిస్తామని రాజకీయ పార్టీలకు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డీఆర్‌ఓ శ్రీలత, అసిస్టెంట్ కలెక్టర్‌శౌర్యమన్ పటేల్, డీటీసీ సుశీల, సువిధ నోడల్ ఆఫీసర్ ఇతర అధికారులు, వైఎస్‌ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతి కుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మందకృష్ణమాదిగ ప్యాకేజీ స్టార్

- ఎమ్మార్పీఎస్‌ను అడ్డుపెట్టుకుని సొంత సామాజికవర్గాన్నే మోసగిస్తున్నాడు
- మాదిగలను అక్కున చేర్చుకుంది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే..
- అంటరానివారుగా చూసింది చంద్రబాబు, టీడీపీ నేతలే..
- మాదిగ కార్పొరేషన్ సాధన సమితి రాష్ట్ర కోకన్వీనర్ చెరుకూరి కిరణ్



మాట్లాడుతున్న మాదిగ కార్పొరేషన్ సాధన సమితి నాయకుడు చెరుకూరి కిరణ్

టంగుటూరు: ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని అడ్డుపెట్టుకుని మాదిగ సామాజిక వర్గాన్ని మోసం చేస్తున్న మందకృష్ణ మాదిగ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని మాదిగ కార్పొరేషన్ సాధన సమితి రాష్ట్ర కోకన్వీనర్ చెరుకూరి కిరణ్ పేర్కొన్నారు. టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడికి రెండో దత్తపుత్రుడిలా వ్యవహరిస్తున్న మందకృష్ణ ప్యాకేజీ స్టార్‌గా మారాడని దుయ్యబట్టారు. మంగళవారం టంగుటూరులోని ఓ ప్రైవేట్ హోటల్లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు సీఎం వైఎస్ జగన్ కల్పించిన అవకాశాలు రాష్ట్ర చరిత్రలో ఏ నాయకుడికీ సాధ్యం కాలేదన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని అడ్డుపెట్టుకుని మందకృష్ణ చేస్తున్న మోసాలు మాదిగలందరికీ తెలుసన్నారు. వైఎస్ జగన్ 2019 ఎన్నికల్లో మాదిగలకు 8 అసెంబ్లీ, ఒక ఎమ్మెల్సీ, ఒక ఎంపీ స్థానం కేటాయించారని, 10 కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఒక ఆర్టీఐ డైరెక్టర్ పదవులు ఇవ్వడమే కాకుండా ఇద్దరికి మంత్రి పదవులు కట్టబెట్టి రాజకీయంగా అందలం ఎక్కించారని వివరించారు. రానున్న ఎన్నికల్లో మాదిగలకు 10 అసెంబ్లీ సీట్లు ప్రకటించారని పేర్కొన్నారు. 2014లో మాదిగ యువతపై చంద్రబాబునాయుడు కేసులు పెడితే మందకృష్ణ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని 2014లో ఆ పార్టీ ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. సుప్రీంకోర్టులో పరిణామాలను అడ్డుపెట్టుకుని చంద్రబాబు, మోదీ లబ్ధి పొందాలని చూస్తున్న సంగతి తెలియదా అని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో నీ ఆటలు సాగనీయబోమని మందకృష్ణను హెచ్చరించారు. సమావేశంలో దళిత సంఘ నాయకులు బక్కా తిరుమలరావు మాదిగ, రావినూతల మధన్, రావినూతల రాజు, కిషోర్, బాలరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నడిరేయి.. మరణ మృదంగం

- ఆటో ఢీకొనడంతో బైకుపై ఉన్న యువకులు అక్కడికక్కడే మృతి
- పేర్నమిట్ట సమీపంలో కర్నూలు రోడ్డుపై ఘటన



ఘటనా స్థలంలో వినయ్‌కుమార్, సందీప్ మృతదేహాలు

చీమకుర్తి: ఆటో డ్రైవర్ అతివేగం ఇద్దరు యువకుల ప్రాణాలు బలితీసుకుంది. బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను వెనుక నుంచి ఫోర్ వీలర్ ఆటో ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి వేళ పేర్నమిట్ట సమీపంలోని నాంచారెడ్డిపాలెం వద్ద కర్నూల్ రోడ్డుపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. సంతనూతలపాడు మండలం ఎండ్లూరు గ్రామానికి చెందిన ఆలూరి వినయ్‌కుమార్(23), గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరుకు చెందిన బందెల సందీప్(20) ఎండ్లూరులోని ఒక ప్రైవేట్ పైపుల కంపెనీలో పనిచేస్తున్నారు. బైక్‌కు పెట్రోల్ పోయించుకునేందుకు ఎండ్లూరు డొంక నుంచి పేర్నమిట్ట సమీపంలోని బంక్ వద్దకు బయలుదేరారు. పెట్రోల్ బంక్‌లోకి వెళ్లేందుకు డివైడర్ వద్ద క్రాస్ అవుతుండగా అదే సమయంలో ఒంగోలు వైపు వేగంగా వెళ్తున్న ఆటో వెనుక నుంచి బలం ఢీకొట్టింది. దీంతో బైకుపై ఉన్న ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. వినయ్‌కుమార్ తండ్రి సురేష్ బాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఒంగోలు తాలూకా ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

## ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలి






ఎన్నికల విధులపై శిక్షణలో కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

కొండపి(మద్దిపూడి): ఎన్నికల కమిషన్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించడంతో పాటు ఎన్నికలు పూర్తయ్యే వరకు నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఎన్నికల అధికారులకు సూచించారు. కొండపి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎన్నికల కమిషన్ నిబంధనలపై మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల నియమావళిని అమలు చేయడం, అభ్యర్థుల ఎన్నికల ఖర్చును సక్రమంగా నమోదు చేయడం కీలక అంశాలని వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహించడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. రిటర్నింగ్ అధికారులందరూ తమ బృందాల్లోని అధికారులను సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల ఖర్చులను ఎప్పటికప్పుడు ఖర్చు రిజిస్టరులో నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలను అరికట్టడానికి పనిచేస్తున్న నోడల్ ఏజెన్సీలు కచ్చితంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఎన్నికల నిర్వహణపై రూపొందించిన సీ విజిల్ యాప్, ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టంలపై అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల అధికారులకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, సీ విజిల్ యాప్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టంలపై జిల్లా ఆడిట్ అధికారి శంకర్ నారాయణరెడ్డి, ఉపాధి కల్పనా అధికారి భరద్వాజ్‌లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల సిబ్బంది వివరించారు. కొండపి ఏఆర్‌ఓ ఏ కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ విశ్వేశ్వరరావు, నియోజకవర్గ నోడల్ అధికారులు, ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, పోస్టల్ బ్యాలెట్ టీమ్, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ టీమ్ అధికారులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడు మృతి

- ప్రజాగళం సభకు వెళ్లి వస్తుండగా ప్రమాదం



మృతుడు మల్లికార్జున(ఫైల్)

పెద్దదోర్నాల: చిలకలూరిపేట వద్ద ఈ నెల 17న టీడీపీ కూటమి నిర్వహించిన ప్రజాగళం సభలో పాల్గొని తిరుగు ప్రయాణంలో వినుగొండ వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన పెద్దదోర్నాల యువకుడు రామడుగు మల్లికార్జున(36) గుంటూరులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఇతను మార్కాపురంలోని ఓ ప్రైవేట్ కాలేజీ బస్సుకు క్లీనర్‌గా పని చేస్తున్నాడు. మార్కాపురం టీడీపీ నేతలు తమ కార్యకర్తలను కాలేజీ బస్సుల్లో ప్రజాగళం సభకు తరలించారు. ఈ క్రమంలో సభకు వెళ్లిన మల్లికార్జున ప్రమాదంలో గాయపడి మృతి చెందాడు. మృతుడికి కుమారుడు(11), కుమార్తె(5) ఉన్నారు. మల్లికార్జున అకాల మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

### పకడ్బందీగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

సింగరాయకొండ(మద్దిపూడి): ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని డీఈఓ డి.సుభద్ర పేర్కొన్నారు. మంగళవారం ఆమె ఒంగోలు, సింగరాయకొండలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. సింగరాయకొండలో డీఈఓ విలేకరులతో మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులు, ఉపాధ్యాయులు, చివరికి ప్రత్యేక తనిఖీ బృందాలు కూడా సెల్‌ఫోన్ తీసుకెళ్లకుండా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 25 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు, 9 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలను పర్యవేక్షించేందుకు 18 ప్రత్యేక తనిఖీ బృందాలు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లను నియమించినట్లు వివరించారు. డీవైఈఓ అనితా రోజ్‌రాణి, ఎంఈఓలు బి.శివన్నారాయణ, ఎం.శ్రీనివాసరావు, వెంకారెడ్డి పాల్గొన్నారు.